తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 18- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 75 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## నిషేధిత భూముల సమస్యలకు పరిష్కారం

- ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- 15 రోజుల్లో దరఖాస్తుల పరిష్కారం
- టోల్‌ఫ్రీ సేవలు అందుబాటులోకి
- అసలైన యజమానులకు న్యాయం హామీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యలపై వేగంగా స్పందించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. భూములకు సంబంధించిన వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, పెండింగ్ దరఖాస్తులపై ఈ కమిటీ వారానికో సారి సమావేశమై నిర్ణయాలు తీసుకోనుందని తెలిపారు.

మిగతా 2లో

# టిమ్స్ ప్రారంభం.. వైద్య రంగానికి కొత్త ఊపు



### సనత్‌నగర్‌లో డా. ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభం
### అత్యాధునిక వైద్య సేవలపై సీఎం సమీక్ష
### పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం లక్ష్యం
### బీఆర్ఎస్ పాలనపై రేవంత్ విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా. ఎంసీఆర్ టిమ్స్)ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవల ఏర్పాట్లను పరిశీలించారు. కార్డియో, రీనల్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సైన్సెస్ విభాగాల్లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ట్రామా కేర్ యూనిట్లు, ఐసీయూలు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా

మిగతా 2లో



## అంగన్‌వాడీలకు పెరిగిన పదవీ విరమణ ప్రయోజనాలు

- మంత్రి సీతక్క చొరవతో పెరిగిన బెనిఫిట్స్
- 60 ఏళ్లు దాటిన వారికీ వర్తింపు
- 2,572 మంది ఖాతాల్లో నిధుల జమ
- రూ.15.61 కోట్ల సాయం అందజేత

హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని అమలు చేస్తోంది. మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో అంగన్‌వాడీ సిబ్బందికి పదవీ విరమణ అనంతరం అందించే సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను గణనీయంగా పెంచింది. 65 ఏళ్ల వయస్సులో పదవీ విరమణ చేసిన వారితో పాటు, 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు

మిగతా 2లో

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో ఉద్యోగ విప్లవం

- 2028 మార్చి నాటికి పనుల పూర్తి లక్ష్యం
- రూ.15 వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ
- రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- తెలంగాణకు మరిన్ని పారిశ్రామిక పార్కుల కోరింపు



హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ తెలంగాణ పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునివ్వనుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ పారిశ్రామిక నగర అభివృద్ధి పనులను 2028 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ నిర్వహించిన వీడియో సమావేశంలో శ్రీధర్ బాబు వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయెల్‌తో పాటు

మిగతా 2లో



## మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

- ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి
- మహాలక్ష్మి హామీ అమలుపై స్పష్టత
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి ప్రాధాన్యం
- మెదక్ ఖిల్లాకు ప్రత్యేక తపాలా కవర్ ఆవిష్కరణ

మెదక్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

మహిళల ఆర్థిక స్వావలంబన, యువతకు నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శక్తి, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జీ. వివేక్ వెంకటస్వామి తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని శాంతా బయోటెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో

## రూ.2 లక్షల రుణమాఫీతో
# రైతులకు ఊరట

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం
- రూ.20,616 కోట్ల రుణాల మాఫీ
- ఇంటింటి ధృవీకరణతో అర్హుల గుర్తింపు
- పారదర్శక అమలుపై ప్రభుత్వ దృష్టి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

8లో



## నకిలీ విగ్రహంతో మోసం.. ఆరుగురు అరెస్ట్

- లక్ష్మీదేవి విగ్రహం పేరిట మోసయత్నం
- అరుదైన రాయి అంటూ అమాయకులకు వల
- టాస్క్‌ఫోర్స్, పోలీసుల సంయుక్త దాడి
- విగ్రహం, వాహనం, ఫోన్లు స్వాధీనం



హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం, మహిమలు ఉన్నాయంటూ ప్రచారం చేసిన ఓ రాయి పేరిట అమాయకులను మోసం చేసేందుకు ప్రయత్నించిన ఆరుగురు సభ్యుల ముఠాను హైదరాబాద్ నగర పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సంయుక్త చర్యలో ఈ ముఠా గుట్టురట్టైంది. నిందితుల వద్ద నుంచి నకిలీ విగ్రహం, గులాబీ రంగు రాయి, వాహనం, మొబైల్ ఫోన్లు సహా పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ గాయక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెల్లడించిన వివరాల ప్రకారం,

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# టిమ్స్ ప్రారంభం.. వైద్య రంగానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. రోగుల నమోదు విధానం, రిసెప్షన్ కేంద్రాలు, టోకెన్ డిస్పెన్సర్ వ్యవస్థ, ఓపీ కౌంటర్ల పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి సేవల నాణ్యతపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు వైద్యం ఖరీదైనదిగా మారిందని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో టిమ్స్ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యమైన విద్య, శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆరోగ్య రంగంలో తమ ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని ముఖ్యమంత్రి



వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పథకం కోసం రూ.2,700 కోట్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,526 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.5,226 కోట్లను పేదల ఆరోగ్య రక్షణ కోసం వినియోగించామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో వైద్య ఆరోగ్య శాఖకు రూ.21,800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని, ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

సనత్‌నగర్ టిమ్స్‌తో పాటు ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను కూడా వేగవంతం చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రానికి అదనంగా 10 వేల పడకల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రతి ఆసుపత్రికి ప్రత్యేక డైరెక్టర్‌ను నియమించి కార్పొరేట్ తరహాలో నిర్వహణ చేపడతామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఘాటు విమర్శలు చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ ఉస్మానియా ఆసుపత్రి సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. టిమ్స్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణాలను ప్రారంభించినప్పటికీ పూర్తి చేయలేదన్నారు. ఆసుపత్రుల నిర్మాణాల కంటే ఇతర అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టారని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మరని, రాష్ట్రంలో వైద్య రంగ అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుల విమర్శలకు కూడా ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆసుపత్రులను పూర్తి చేయని వారు ఇప్పుడు వాటిపై హక్కు చెప్పుకోవడం ఆశ్చర్యకరమన్నారు. ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌ల నిర్మాణానికి చూపిన వేగం పేదలకు వైద్యం అందించే ఆసుపత్రుల నిర్మాణంలో కనిపించలేదని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మరని, తాము ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే తమకు బలమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నిషేధిత భూముల సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ప్రధానంగా ఈ నాలుగు జిల్లాల్లోనే 22ఏ భూముల సమస్యలు అధికంగా ఉన్నాయని, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోనే 511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పెండింగ్ దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

నిషేధిత భూముల సమస్యలపై ప్రజలకు సమాచారం అందించేందుకు 1800 5994788 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నంబర్‌కు అందిన ఫిర్యాదులు, సందేహాలకు కనీసం మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ సాధ్యం కాని కేసుల్లో ఎందుకు చేయలేమో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన వారికి నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. భూదాన్ భూములు, యూఎల్‌సీ భూములు, దేవాదాయ, అటవీ భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అసలైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, భూముల రికార్డుల్లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా అసలు భూములను గుర్తించి అవసరమైన చోట రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేస్తామని వెల్లడించారు.

గతంలో నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిన కొన్ని భూములు సాంకేతిక కారణాలతో ఇప్పటికీ అదే జాబితాలో కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. దీంతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయితే ఈ సమస్యలను ప్రజలపై వదిలేయకుండా ప్రభుత్వం స్వయంగా పరిష్కార బాధ్యత తీసుకుంటోందని స్పష్టం చేశారు. అధికారుల తప్పిదాల కారణంగా ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రైవేటు ఆస్తుల హక్కులను కూడా కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిషేధిత భూముల పేరుతో అసలైన యజమానులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సమగ్ర విధానాన్ని అమలు చేస్తామని, భూముల రిజిస్ట్రేషన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# అంగన్‌వాడీలకు పెరిగిన పదవీ విరమణ ప్రయోజనాలు

(మొదటి పేజీ తరువాయి)

స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగినా పెంచిన ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం ఉత్తర్వులు అమలు చేస్తోంది. గతంలో 2023 ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు రూ.1 లక్ష, హెల్పర్లు మరియు మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.50 వేల సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ మాత్రమే అందేవి. అయితే 2025 మే 30న ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ మొత్తాలను రెట్టింపు చేసింది. తాజా నిబంధనల ప్రకారం పదవీ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు.

అంతేకాకుండా 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకున్నా అదే స్థాయిలో వాలంటరీ డిస్‌ఎంగేజ్‌మెంట్ బెనిఫిట్ పొందే అవకాశం కల్పించారు. దీర్ఘకాలంగా సేవలందించిన సిబ్బందికి గౌరవప్రదమైన వీడ్కోలు ఇవ్వడంతో పాటు భవిష్యత్ జీవనానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిర్ణయం లక్ష్యమని అధికారులు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2,572 మంది అంగన్‌వాడీ సిబ్బంది ఖాతాల్లో మొత్తం రూ.15.61 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇందులో 473 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.4.73 కోట్లు, 1,930 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.9.65 కోట్లు చెల్లించారు. దీంతో వేలాది మంది అంగన్‌వాడీ సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించినట్లు అధికారులు పేర్కొన్నారు.

పెంచిన బెనిఫిట్స్ అమలులో భాగంగా మరో 14 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.28 లక్షలు, 59 మంది హెల్పర్లకు రూ.59 లక్షలు చెల్లించారు. అదేవిధంగా పాత నిబంధనల ప్రకారం అర్హత సాధించిన 96 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.36.10 లక్షలు అందజేశారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నేరుగా వారి ఖాతాల్లోనే నిధులు జమ చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ సిబ్బందికి కూడా ఈ ప్రభుత్వం బకాయి ప్రయోజనాలను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, భవిష్యత్‌లోనూ వారి సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి చెప్పారు. ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న వందలాది పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో యువత మోసపోకుండా పారదర్శక వ్యవస్థ ద్వారా అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. విదేశీ ఉపాధి అవకాశాల కోసం జర్మన్, జపనీస్ భాషల్లో కూడా



శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీలు, వడ్డీలేని రుణాలు, ఆదాయ వనరులు కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు.

మెదక్ ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను గుర్తిస్తూ తపాలా శాఖ విడుదల చేసిన ప్రత్యేక తపాలా కవర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మెదక్ ఖిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం కుచారం కస్తూర్బా బాలికల విద్యాలయంలో రూ.3.25 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు మౌలిక సదుపాయాలను ప్రారంభించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో ప్రజలకు మెరుగైన ఫలితాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

# జహీరాబాద్ స్మార్ట్ సిటీతో ఉద్యోగ విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు.

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థకు అభివృద్ధి ప్రణాళిక అందజేశామని, ఇంజనీరింగ్, కొనుగోలు, నిర్మాణ విధానంలో చేపడుతున్న పనులు నిర్ణీత గడువులో పూర్తవుతాయని చెప్పారు.

నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, విద్యుత్ సరఫరా మౌలిక వసతుల ఏర్పాటును కూడా వేగంగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలకు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలను సమకూర్చి పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో కనీసం నాలుగు పార్కులను తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను కోరినట్లు శ్రీధర్ బాబు తెలిపారు. పారిశ్రామికీకరణ ద్వారా ఉపాధి, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# నకిలీ విగ్రహంతో మోసం.. ఆరుగురు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

కాటేదాన్‌లోని లక్ష్మిగూడ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు నకిలీ పురాతన వస్తువులను అధిక ధరలకు విక్రయించేందుకు కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి దాడి నిర్వహించాయి.

విచారణలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన కేతావత్ రాజు అలియాస్ కట్టప్ప, హైదరాబాద్‌కు చెందిన పి. నరసింహ, వడత్య కుమార్, ప్రవీణ్ సింగ్, మంగళి బసవ నరేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన చల్లా రవి కలిసి ముఠాగా ఏర్పడినట్లు తేలింది. ప్రజలను నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో ఈ వ్యవహారాన్ని నడిపినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో 2024లో పి.నరసింహ అనే వ్యక్తి నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహాన్ని రూ.10 లక్షలకు కొనుగోలు చేసి మోసపోయినట్లు వెల్లడైంది. అనంతరం ఆ విగ్రహాన్ని ఇతరులకు అందజేసి, దానికి దివ్యశక్తులు ఉన్నాయని, అదృష్టాన్ని తీసుకొస్తుందని ప్రచారం చేస్తూ అమాయకులకు కోట్ల రూపాయలకు విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు తెలిసింది.

ఇదే సమయంలో కేతావత్ రాజు తన వద్ద ఉన్న గులాబీ రంగు రాయిని అత్యంత అరుదైనదిగా, ప్రత్యేక శక్తులు కలిగినదిగా ప్రచారం చేసి అధిక ధరలకు అమ్మాలని యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఈ రెండు వస్తువులను ఉపయోగించి కొనుగోలుదారులను మోసం చేసే ప్రయత్నం జరుగుతుండగానే పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఒక నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం, ఒక గులాబీ రంగు రాయి, ఒక కారు, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు రసాయన ద్రావణాల సీసాలు, రెండు ఎరుపు రంగు తువాళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఇలాంటి మహిమలు, దివ్యశక్తుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# సీఎం నివాసంపై హరీశ్ రావు సంచలన ఆరోపణ

- శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- జాబితా వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి
- ప్రభుత్వ వైఖరిపై విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో నిషేధిత ఆస్తుల జాబితాపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చిన విధానంపై అనేక సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నివాసానికే ఈ సమస్య ఎదురవుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ప్రజల ఆస్తుల హక్కులకు సంబంధించిన అంశంలో పారదర్శకత అత్యంత అవసరమని, ప్రతి ఆస్తి ఏ కారణంతో నిషేధిత జాబితాలోకి వెళ్లిందో స్పష్టత ఇవ్వాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది భూయజమానులు నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు అన్నారు. తమ భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేయడం వంటి ప్రక్రియల్లో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల ఆందోళనలను తొలగించేలా నిర్దిష్ట కాలపరిమితితో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తుల పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని మాజీ మంత్రి కోరారు. ఏ జిల్లాలో ఎన్ని ఆస్తులు ఉన్నాయి, వాటిని ఏ ప్రాతిపదికన జాబితాలో చేర్చారు, ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలకు సమాచారం దాచిపెట్టడం వల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. నిషేధిత జాబితా అంశంలో పూర్తి వివరాలు వెల్లడించకపోవడం వల్ల ప్రభుత్వం ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు. భూములకు సంబంధించిన వివాదాలు, నిషేధిత జాబితా సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేస్తున్నాయని హరీశ్ రావు తెలిపారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పరిష్కరించాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న ప్రతి ఆస్తిపై స్పష్టత ఇవ్వడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సాంస్కృతిక వైభవానికి రికార్డు కిరీటం




- **వల్బాపూర్ వాసి సదానిరంజన్ సిద్ధాంతికి ఘన సన్మానం**

**ఎల్కతుర్తి, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు)** :భారతీయ సంస్కృతి, తెలంగాణ సాంస్కృతిక వైభవం, దేశభక్తి భావాలను ప్రతిబింబించేలా నిర్వహించిన బహుళ నృత్య ప్రదర్శన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదై రికార్డు కిరీటాన్ని సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో కళానిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళానిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ఎ. సురేందర్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 80 మంది నృత్యకారులు 80 నిమిషాల పాటు నిరంతరంగా వివిధ నృత్య రూపాలను ప్రదర్శించారు. కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, పేరిణి, వెస్ట్రన్, సెమీ క్లాసికల్, దేశభక్తి నృత్యాలతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన బోనాలు, బతుకమ్మ, కోలాటం, దండియా తదితర కళారూపాలను ప్రదర్శించారు.

భిన్న నృత్య సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించడం ద్వారా భారతీయ సంస్కృతిలోని వైవిధ్యం, జాతీయ ఐక్యత, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటారు. ఈ విశిష్ట కార్యక్రమం 'బహుళ దేశభక్తి కార్యక్రమం' పేరుతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన శ్రీ పశుపతినాథ దేవస్థానం అర్చక పురోహితులు, తెలంగాణ వీరశైవ జంగమ డీఏన్ అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానిరంజన్ సిద్ధాంతి పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడంలో భాగస్వామ్యమయ్యారు. ఆయనకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తరఫున ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.


అనంతరం ప్రముఖ సినీ దర్శకులు నందకిషోర్, హీరో విశ్వదేవ్ రాచకొండ చేతుల మీదుగా సదానిరంజన్ సిద్ధాంతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రికార్డ్స్ ప్రతినిధులు, జ్యూరీ సభ్యులు కార్యక్రమాన్ని అభినందించారు.

సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, కళారూపాలను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. కళల ద్వారా దేశభక్తి భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని పేర్కొన్నారు. విభిన్న కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని, దేశ ఐక్యతను చాటారని తెలిపారు.

వల్బాపూర్ గ్రామానికి చెందిన సదానిరంజన్ సిద్ధాంతికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో గుర్తింపు లభించడం పట్ల గ్రామస్థులు, భక్తులు, అర్చక పురోహితులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.

# నాగేంద్రస్వామి ఆలయంలో నాగుల పంచమి

- **భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**



**హుజురాబాద్,ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు ):** నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి నాగేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని నాగేంద్రస్వామిని దర్శించుకున్నారు.

భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో నాగేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు, హారతులు నిర్వహించారు. భక్తులు పాలు, పసుపు, కుంకుమ, పుష్పాలతో నాగదేవతకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగుల పంచమి రోజున నాగదేవతను పూజిస్తే కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలుగుతాయని విశ్వాసంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నాగేంద్రస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుటుంబ సభ్యుల క్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగుల పంచమి సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ శర్మ మాట్లాడుతూ నాగుల పంచమి హిందూ సంప్రదాయంలో ఎంతో విశిష్టమైన పర్వదినమని తెలిపారు. నాగేంద్రస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తి, ఆధ్యాత్మిక భావనతో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులతో నాగుల పంచమి వేడుకలు ఘనంగా ముగిశాయి.

# ఉద్దీపనం-3 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- **విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యం.**




**దమ్మపేట, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్దీపనం-3 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి కోరారు. దమ్మపేట మండలం మొద్దులగూడెం ఎస్టీ కాలనీలోని ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉద్దీపనం-3 కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు గత మూడు సంవత్సరాలుగా ఐటీడీఏ స్థాయిలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించేందుకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని వివరించారు. ఉద్దీపనం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లోని మేధో సామర్థ్యాలను వెలికితీసేందుకు అవకాశం కలుగుతుందని విజయలక్ష్మి పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు కూడా పాఠశాలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సరళమైన, నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేతం రుక్మిణి, ఉపసర్పంచ్ సరస్వతి, గ్రామస్తులు దొడ్డా రామారావు, శ్రీను, కురం రాజా, రాజిని, చెన్నారావు, మట్టా రవివర్మ, తల్లిదండ్రులు పూచి మౌనిక, మొగిలి జ్యోతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజావాణిలో ప్రజా సమస్యల స్వీకరణ – మండల స్థాయిలో పరిష్కారానికి చర్యలు



**వేలేరు, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేలేరు మండల కేంద్రంలో మండల స్థాయి ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) కోమి, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ కిషన్ నాయక్, ఎంఆర్ఓ కోమి, సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుని అర్హులైన వారికి న్యాయం చేకూర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అనంతరం ప్రజల నుండి వచ్చిన వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీవో బుచ్చిరెడ్డి, గొల్ల కిష్టంపల్లి సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, మండలంలోని వివిధ శాఖల అధికారులు కవిత, చంద్రు నాయక్, రూపవతి, చంద్రమౌళి, అభిలాష్, కుమారస్వామి, విజయ్ కుమార్, నవీన్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు అండగా 25 ఏళ్ల సేవలు..




- **ముల్కనూర్ మహిళా డెయిరీ వేడుకలు**

**భీమదేవరపల్లి, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూర్ మహిళా డైరీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రజతోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల డైరీ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.


కార్యక్రమంలో డైరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, మేనేజర్ భాస్కర్ రెడ్డి, డైరీ సిబ్బంది, మహిళా సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ 25 ఏళ్లుగా అందిస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు.భవిష్యత్‌లో పాడి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు పాల సేకరణను విస్తరించడం, డైరీని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి అండగా నిలవాలి: మండల సురేందర్



**భీమదేవరపల్లి, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని భీమదేవరపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మండల సురేందర్ డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాలను ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలపై కోతలు విధిస్తోందని సురేందర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు చేయలేదని ఆరోపించారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ఆయన.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# చేయూత పథకం కింద కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



**వేలేరు, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న చేయూత పథకం కింద కొత్త పెన్షన్ల మంజూరు కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు చేయూత పథకం ద్వారా కొత్త పెన్షన్ల మంజూరు కోసం ఈ నెల 31వ తేదీ వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ బాధితులు, వికలాంగులు తదితర అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ బిల్లా యాదగిరి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి విజయ్తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పింఛన్ కోసం డబ్బులు ఇవ్వకండి.. మోసపోవద్దు

- అర్హత ఆధారంగానే పింఛన్లు.. మధ్యవర్తులకు డబ్బులు చెల్లించొద్దు
- వార్డు మెంబర్ నడిగోటి నరేష్



**భీమదేవరపల్లి, ఆగస్టు 17, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పింఛన్ ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వవద్దని భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ 8వ వార్డు మెంబర్ నడిగోటి నరేష్ గ్రామ ప్రజలకు సూచించారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు తదితర పింఛన్లకు అర్హులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు గుర్తిస్తారని తెలిపారు. పింఛన్ మంజూరు చేయిస్తామని, జాబితాలో పేరు చేర్పిస్తామని చెప్పే మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని హెచ్చరించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నరేష్ కోరారు.

# చిన్నారికి 'జస్వికశ్రీ' అని నామకరణం చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కాంపాటి రాకేష్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. జన్మించిన 12 రోజుల అనంతరం చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. చిన్నారి వైద్య చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు అవసరం కావడంతో ఆ కుటుంబం ఆందోళనకు గురైంది.

ఈ విషయాన్ని ఖమ్మం నగరపాలక సంస్థలో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న చిన్నారి నానమ్మ నరసమ్మ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్ వెంటనే స్పందించి, హృదయ స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రభుత్వ సహకారంతో చిన్నారి గుండె శస్త్రచికిత్సకు అవసరమైన రూ.14 లక్షల ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ సహాయంతో జూలై 28న చిన్నారికి గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించగా, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా కోలుకుంది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు తమ కుమార్తెను మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి తీసుకువచ్చి, గ్రీవెన్స్ కార్యక్రమంలో తమకు అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారికి మున్సిపల్ కమిషనర్ పేరు పెట్టాలని కుటుంబ సభ్యులు కోరగా, కమిషనర్ అభిషేక్ అగస్త్య సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారికి 'జస్వికశ్రీ' అని నామకరణం చేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో, సంతోషంగా ఎదగాలని కమిషనర్ ఆకాంక్షించారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి సకాలంలో స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్యకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# బుచ్చమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే, ఎంపీ నివాళులు



- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి

**పెద్దమందడి, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన హైకోర్టు ఏజీపీ హంసు వర్మ, డీఎస్ మహేష్, కేంద్ర రైల్వే ఉద్యోగి మాణిక్ వర్మల మాతృమూర్తి సంజాపాగ బుచ్చమ్మ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి, ఎంపీ మల్లు రవి ఆమె మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి బుచ్చమ్మ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుమారులు హంసు వర్మ, డీఎస్ మహేష్, మాణిక్ వర్మలను ఓదార్చి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బుచ్చమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం ఎంపీ మల్లు రవి కూడా బుచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుచ్చమ్మ మృతి కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బంధువులు, ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన 11కేవీ విద్యుత్ లైన్ పనులు విరమించుకోవాలి

- ప్రజావాణిలో బలిజపల్లి గ్రామస్తుల ఫిర్యాదు




**పెద్దమందడి, ఆగస్టు17 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి చిమనగుంటపల్లి, అంకూర్ గ్రామాల అవసరాల కోసం నూతనంగా మరో బ్రేకర్ ఏర్పాటు చేసి 11 కేవీ విద్యుత్ లైన్ నిర్మించేందుకు అధికారులు, కాంట్రాక్టర్ చేపట్టిన చర్యలను విరమించుకోవాలని బలిజపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెద్దమందడి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే చిమనగుంటపల్లి, అంకూర్ గ్రామాలకు వేర్వేరుగా ఫీడర్లు, 11 కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ అదనంగా మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం వల్ల తమ పొలాల మీదుగా విద్యుత్ లైన్లు అధికంగా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వరి పంట కోత సమయంలో, వర్షాకాలంలో విద్యుత్ లైన్ల వల్ల షార్ట్ సర్క్యూట్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు. రైతుల భద్రత, పంటల రక్షణను దృష్టిలో ఉంచుకుని నూతన 11 కేవీ లైన్ నిర్మాణ పనులను వెంటనే విరమించుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టు నాగేష్, సుభాష్ గౌడ్, పానుగంటి రాజుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు

- డిమాండ్లు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల విజ్ఞప్తి



**వనపర్తి, ఆగస్టు17(తెలంగాణ ముచ్చట్లు):** గత మూడు నెలలుగా జీతాలు అందక ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వనపర్తి జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయడంతో పాటు తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఫిక్స్‌డ్ టెర్మ్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ)గా గుర్తించాలని, 4779 సర్క్యులర్‌ను రద్దు చేసి జాబితా3లో తొలగించబడిన 269 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందరికీ సమాన వేతనాలు, నూతన సెల్‌ఫోన్లు, కుటుంబానికి రూ.15 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, ఫిట్టింగ్, ప్లాంటింగ్, వాచర్స్ తదితర పనులతో పాటు ప్రతిరోజూ రెండు ఫొటోలు పంపించాల్సిన బాధ్యతలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పనిభారం అధికంగా ఉన్నప్పటికీ వేతనం రూ.10 వేల లోపే ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షులు పానుగంటి ఆనంద్, గౌరవ అధ్యక్షులు నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు సాతర్లాల రామకృష్ణ, బిరయ్య, జనరల్ సెక్రెటరీ అశోక్ గౌడ్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ నుంచి తోటపల్లి శంకర్ తొలగింపు



**జవహర్‌నగర్, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిబంధనావళికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు.

ఈ మేరకు పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో తోటపల్లి శంకర్ వ్యవహారశైలిపై చర్చించి, పార్టీ నిబంధనావళికి విరుద్ధంగా వ్యవహరించినట్లు భావించిన నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు ఉమా మహేష్ వెల్లడించారు. జిల్లా కార్యవర్గం తీర్మానం మేరకు శంకర్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు తెలిపారు.

పార్టీ క్రమశిక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, నిబంధనలను ఉల్లంఘించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఉమా మహేష్ స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో పని చేయడం ప్రతి సభ్యుడి బాధ్యత అన్నారు. ఇకపై తోటపల్లి శంకర్‌కు సిపిఐతో ఎలాంటి సంబంధం ఉండదని ఉమా మహేష్ స్పష్టం చేశారు. పార్టీ పేరు, పదవి లేదా పార్టీ కార్యక్రమాలను శంకర్ వినియోగించరాదని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గం తీసుకున్న నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.

ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరిన ఉమా మహేష్.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ క్రమశిక్షణతో ముందుకు సాగుతుందని తెలిపారు.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- పెద్దమందడి ఎంపీడీవో పరిణత, తహసిల్దార్ మల్లికార్జున




**పెద్దమందడి, ఆగస్టు17(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దమందడి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పైభాగంలో ఉన్న మినీ హాల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 12 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పరిణత, తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి మంజులత, వ్యవసాయ అధికారి సైదయ్య యాదవ్, ఏపీఎం సక్కురునాథ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫోటో ముద్రించాలి

- రేవంత్ రెడ్డి మొహం తెలంగాణ రాజముద్ర కాదు: పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్



**భీమదేవరపల్లి, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను తప్పనిసరిగా ముద్రించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేద, నిరుపేద కుటుంబాలకు ఉచిత బియ్యం, ఆహార భద్రతతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణలోనూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఏ ఒక్క పార్టీకి సంబంధించిన రాజకీయ పత్రం కాదని, పేద ప్రజల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన ప్రభుత్వ గుర్తింపు పత్రమని అన్నారు. రేషన్ కార్డులను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చడం సరికాదని సూచించారు.

రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ముద్రించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. "రేవంత్ రెడ్డి మొహం తెలంగాణ రాజముద్ర కాదు.. రేషన్ కార్డుపై వ్యక్తిగత రాజకీయ ప్రచారం కోసం ఫోటో పెట్టడం సరికాదు" అని అన్నారు. కరోనా విపత్తు సమయంలోనూ, అనంతరం కూడా పేద ప్రజలకు ఉచిత రేషన్ అందించడంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొత్తగా జారీ చేసే రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను ముద్రించాలని పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచే పథకాలను కొనసాగించాలి

- బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు ):** కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో నాడు కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకాలు వేలాది కుటుంబాలకు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తుచేశారు. హైకోర్టులో ఈ పథకాలపై విచారణ జరుగుతున్న సమయంలో ప్రభుత్వం తగిన విధంగా స్పందించి, పథకాల ప్రయోజనాలు అర్హులైన కుటుంబాలకు అందేలా న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పేద కుటుంబాలు నష్టపోయే పరిస్థితి రావద్దని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటే.. కళ్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ హామీ అమలుపై స్పష్టత లేకుండా పోయిందని నామ విమర్శించారు. పేదల పెళ్లిళ్ల విషయంలో రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నామ డిమాండ్ చేశారు. ఈ పథకాల అమలుపై నెలకొన్న అనిశ్చితికి తెరదించి, పేద కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని స్పష్టం చేశారు

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



- **పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**
- **మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**ఖమ్మం బ్యూరో,ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు ):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరి కాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు.

సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు.

కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలి

రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు

అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు.

ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు.

రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్

సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.

అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు.

మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కోకన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

# డాక్టర్ బండి కుమార్ కు వందేభారత్ అవార్డు ప్రదానం..

- **సంచలనాత్మక కథనాలకు కేరాఫ్..**
- **వెల్లు వెత్తుతున్న అభినందనలు..**




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కు అరుదైన గౌరవం దక్కింది. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్ 2వ అంతస్తులో వారు నిర్వహించిన వందేభారత్ జాతీయ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా పత్రికా రంగంలో సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ కి వందేభారత్ జాతీయ అవార్డును అందజేశారు. ప్రముఖ సినీ గేయ రచయిత జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ సినీ నటులు పోలా ప్రగడ జనార్ధన్ రావు (జెన్నీ), కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రాజ్ ఎంటర్ ట్రైనర్స్, సీఈఓ మునుకోటి డేవిడ్ రాజ్, వందేభారత్ మూవీ డైరెక్టర్ ఆనందలహరి సంస్థ కన్వీనర్ కళారత్న మల్లం రమేష్ చే ఈ అవార్డును ప్రధానం చేశారు. అనంతరం అవార్డు గ్రహీత సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ మాట్లాడుతూ... తాను రాసిన వార్తలను, సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినందుకు వందేభారత్ జాతీయ సమైకృత వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి డైరెక్టర్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడు తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నేత బొర్రా రాజశేఖర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంత రావు, ఖమ్మం నియోజవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మండల అధ్యక్షులు కేళోతు దేవ్ సింగ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్, కోసూరి శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నేలకొండపల్లి మండల ఇంచార్జి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నేత కమతం రామకృష్ణ, తెలంగాణ ఎరుకల సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ రవి, మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రామారావు, అధికారులు, జర్నలిస్ట్ మిత్రులు, ప్రజా సంఘాలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# గోనె సంచుల డబ్బులు వెంటనే విడుదల చేయాలి

- **ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన చింతకాని మండల బీఆర్ఎస్ రైతు సంఘం నాయకులు**




**ఖమ్మం బ్యూరో , ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండలంలోని మొక్కజొన్న రైతులు కొనుగోలు చేసిన గోనె సంచుల ఖర్చును ప్రభుత్వం వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చింతకాని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మొక్కజొన్న కొనుగోళ్ల సమయంలో ప్రభుత్వం అవసరమైన గోనె సంచులను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, సంచుల కొరత ఏర్పడటంతో రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఒక్కో సంచిని రూ.25 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చిందని నాయకులు తెలిపారు. రైతులు స్వయంగా సంచులు కొనుగోలు చేసిన ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందని హామీ ఇవ్వడంతో రైతులు అదనపు భారం భరించారని పేర్కొన్నారు.

జూన్ నెలలో మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించిన కాటాలు పూర్తయినప్పటికీ, ఇప్పటివరకు రెండు నెలలు గడిచినా రైతులు గోనె సంచుల కోసం ఖర్చు చేసిన డబ్బులు వారి ఖాతాల్లో జమ కాలేదని నాయకులు తెలిపారు. దీంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు గోనె సంచుల ఖర్చును ఇకనైనా ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని వారు కోరారు. భవిష్యత్తులో మొక్కజొన్న కొనుగోళ్ల సమయంలో సంచుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పొనుగోటి రత్నాకర్, సీనియర్ నాయకులు సామినేని అప్పారావు, వంకాయలపాటి సత్యనారాయణ, సర్పంచ్ చేపలమడుగు వీరబాబు, పరిశుద్ధరావు, గడ్డం శ్రీను, యువజన నాయకులు జావిద్, చలమయ్య, షబ్బీర్, చంద్రయ్య, తిరుపతి కొండలరావు, నన్నొక నరసింహారావు, జరగబోయే కృష్ణ, తుడుం పుల్లయ్య, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, మిరియాల శ్రీనివాసరావు, పోట్ల సీతయ్య, గోగుల నరసింహారావు, మండేపూడి రాజేష్, ఐతం సుందర్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'పొంగులేటి' అభయం.. నిరుద్యోగులకు 'రైట్ ఛాయిస్'!

- **ఖమ్మం, కొత్తగూడెంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్**
- **పోస్టర్‌ను ఆవిష్కరించిన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి**




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ కొలువు సాధించి ఖాకీ డ్రెస్‌లో చూడాలనే పేద తల్లిదండ్రుల కలలకు, నిరుద్యోగ యువత పట్టుదలకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉచిత కోచింగ్ కొండంత అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అభ్యర్థుల కోసం ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం గోడపత్రికను ఆవిష్కరించారు.

లక్ష్యమే ప్రామాణికంగా.. అగ్రశ్రేణి శిక్షణ...

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 2016లోనే పొంగులేటి ఉచిత కోచింగ్ ద్వారా వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించి నిలదొక్కుకున్నారని గుర్తుచేశారు. ఈసారి హైదరాబాద్‌కు చెందిన అత్యుత్తమ ఫ్యాకల్టీలతో నాణ్యమైన బోధన అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ప్రతిరోజూ మాక్ టెస్టులు, ఉచితంగా ప్రింటెడ్ స్టడీ మెటీరియల్, వారానికోసారి గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తూ ఫలితమే లక్ష్యంగా తరగతులు నడుస్తాయన్నారు.

ఒకే బ్యాచ్‌లో 344 ఉద్యోగాల రికార్డు

రాష్ట్రంలో పోటీ పరీక్షల శిక్షణలో అగ్రగామిగా ఉన్న 'రైట్ ఛాయిస్ అకాడమీ' చైర్మన్ మెండెం కిరణ్ కుమార్ నేతృత్వంలో ఈ పొంగులేటి ఉచిత శిక్షణ సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గతంలో 2016లో పొంగులేటిరైట్ ఛాయిస్ కలయికలో ఇచ్చిన శిక్షణ ద్వారా ఒకే బ్యాచ్ నుంచి ఏకంగా 326 మంది కానిస్టేబుళ్లు, 18 మంది ఎస్ఐలు ఎంపికై చరిత్ర సృష్టించారని కిరణ్ గుర్తుచేశారు. ఉద్యోగం సాధించాలనే బలమైన సంకల్పం ఉన్న ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

వాట్సాప్‌లోనే రిజిస్ట్రేషన్

శిక్షణ పొందేందుకు అభ్యర్థులు తమ వివరాలను (పేరు, ఫోన్ నంబర్, గ్రామం, మండలం, నియోజకవర్గం) క్రింది నంబర్లకు వాట్సాప్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఖమ్మం జిల్లా అభ్యర్థులు 8985095599, భద్రాద్రి కొత్తగూడెం అభ్యర్థులు 8985096699 సంప్రదించాలని మెండెం కిరణ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కోసూరి శ్రీను, కొప్పుల అశోక్ , బజ్జూరి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ వెంకట్ రెడ్డి, వెన్నపూసల సీతారాములు, బానోత్ కిశోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లపై కాంగ్రెస్ కుట్ర..

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు బ్రేక్ ఎందుకు?"

- **పేదింటి ఆడబిడ్డల జీవితాలతో చెలగాటం వద్దు.. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి**
- **చింతకాని తహసీల్దార్‌కు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు విధించిన స్టేను వెంటనే ఎత్తివేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతకాని మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్ల పాటు నిరంతరంగా అమలు

బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు సుదీర్ఘంగా కొనసాగాయని, ఎలాంటి న్యాయపరమైన ఆటంకాలు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందించామని పేర్కొన్నారు. 2014లో ప్రారంభమైన ఈ పథకాలు పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఆర్థిక అండగా నిలిచాయని అన్నారు. ప్రస్తుతం హైకోర్టు స్టే కారణంగా పెళ్లిళ్లు చేసుకున్న పేద కుటుంబాలు ఆర్థిక సహాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తులం బంగారం దేవుడెరుగు..కేసీఆర్ ఇచ్చిన కల్యాణ లక్ష్మి చెక్కులూ ఇవ్వడం లేదు!

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ తులం బంగారం సంగతి దేవుడెరుగు.. గత కేసీఆర్ ప్రభుత్వం అందించిన కల్యాణ లక్ష్మి ఆర్థిక సాయాన్ని కూడా సకాలంలో అందించకుండా పేద కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. పథకాన్ని నిలిపివేసేలా న్యాయపరమైన చిక్కులు ఏర్పడటానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆరోపించారు. కోర్టులో కేసులు, స్టే పేరుతో పేదింటి ఆడబిడ్డలకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు, ఇప్పటికే అమలులో ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే స్టేకు కారణమని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాల విషయంలో తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తమకు అనుకూలమైన వ్యక్తులు, అనుచరులతో పిటిషన్లు వేయించి పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని వారు విమర్శించారు. అయితే పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి కాంగ్రెస్ అనుచరుడని నిర్ధారించే ఆధారం తమ వద్ద లేదని, ఇది బీఆర్ఎస్ నాయకులు చేసిన రాజకీయ ఆరోపణ మాత్రమేనని స్పష్టం చేశారు. హైకోర్టు పథకాల అమలుకు సంబంధించిన ఎనిమిది జీవోలపై మధ్యంతర స్టే విధించి, తదుపరి విచారణ వరకు లబ్ధిదారులకు చెల్లింపులు చేయవద్దని ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు కోరారు.

రివ్యూ పిటిషన్ దాఖలు చేసి పేదలకు న్యాయం చేయాలి

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రాజకీయాలకు అతీతంగా పేద కుటుంబాల సంక్షేమానికి సంబంధించినవని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. హైకోర్టు స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయ నిపుణులతో సంప్రదించి రివ్యూ/తగిన న్యాయపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు నష్టం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పథకాలపై ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి మళ్లీ యథావిధిగా చెక్కుల పంపిణీ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, గురజాల హనుమంతరావు, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పొనుగోటి రత్నాకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామినేని అప్పారావు, వంకాయలపాటి సత్యనారాయణ, సర్పంచి చేపల మడుగు వీరబాబు, పరిశుద్ధ రావు, గడ్డం శ్రీను బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు జావిద్, చలమయ్య, షబ్బీర్, చంద్రయ్య, తిరుపతి కొండలరావు, నన్నొక నరసింహారావు జరగబోయే కృష్ణ పరస గాని వీరబాబు తుడుం పుల్లయ్య తుమ్మలపల్లి శ్రీనివాస రావు మిరియాల శ్రీనివాసురావు పోట్ల సీతయ్య గోగుల నరసింహారావు మండేపూడి రాజేష్ ఐతం సుందర్ రావు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఉత్తమ సేవ పురస్కార గ్రహీతలకు ఘన సన్మానం




**జమ్మికుంట, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవ పురస్కారాలు అందుకున్న జమ్మికుంట మున్సిపల్ మేనేజర్ గుర్రాల రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్‌లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు ఉత్తమ సేవ పురస్కారాలు అందుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డులు పొందిన ఇద్దరు అధికారులకు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొనసాగించాలి

**జమ్మికుంట, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలును ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. చేయూత, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లను పెంచి ఇస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆధ్వర్యంలో, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన గుల్లి సంపత్ (50) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

స్థానికుల కథనం ప్రకారం.. సంపత్ కొంతకాలంగా కుటుంబ సభ్యులతో వివాదాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు, తమ్ముడితో నెలకొన్న వివాదాలు, వేధింపుల కారణంగానే తాను తీవ్ర మనస్తాపానికి గురైనట్లు పేర్కొంటూ ఓ సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. ఈ ఘటనతో అంబేద్కర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు సమగ్ర విచారణ అనంతరం వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల స్థలాలపై కుట్రలు

- రెండో రోజుకు రిలే దీక్షలు.. బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు



**హుజురాబాద్, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు ):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హుజురాబాద్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ జర్నలిస్టులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా బండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై వివాదాలు, కేసులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సుమారు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టులు నివేశన స్థలాల కోసం పోరాటం చేశారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సమస్యను గుర్తించి స్థలాలు కేటాయించిందన్నారు. జర్నలిస్టులు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న తర్వాత వివాదాలు సృష్టించడం అన్యాయమన్నారు.

ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా ఉన్న జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జర్నలిస్టుల స్థలాల విషయంలో వివాదాలకు కారణమవుతున్న వారిపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని, కేసుల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

వీణవంక జర్నలిస్టుల సంఘీభావం

హుజురాబాద్ జర్నలిస్టుల దీక్షకు వీణవంక మండల జర్నలిస్టులు సంఘీభావం ప్రకటించారు. పెద్ద సంఖ్యలో దీక్షా శిబిరానికి చేరుకుని తమ మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు.

సమస్య పరిష్కారం కాకపోతే వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలు, వార్తలను బహిష్కరిస్తామని జర్నలిస్టులు హెచ్చరించారు. సమస్య కొలిక్కి వచ్చే వరకు ఉమ్మడి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని జర్నలిస్టుల ఉద్యమానికి మద్దతు తెలిపారు. వీణవంక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జె. సతీష్, ప్రధాన కార్యదర్శి పి. శంకర్, సాజిద్, పరశురాం, ఓరం సాగర్, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



**జమ్మికుంట, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 70 నుంచి 75 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో అనారోగ్య పరిస్థితుల్లో గుర్తుతెలియని వ్యక్తి పడి ఉండగా స్థానికులు గుర్తించి జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం సుమారు 3.15 గంటల సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతడిని గుర్తుపట్టిన వారు జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# మధ్యాహ్నపు చారే సాయంత్రం వడ్డిస్తారా?..

- విద్యార్థుల భోజనంలో నిర్లక్ష్యం.. వార్డెన్‌కు ఎంపీ రఘురాం రెడ్డి హెచ్చరిక!
- దమ్ముపేట బాలికల పాఠశాలలో అపరిశుభ్ర స్టాక్ రూమ్‌లు.. మెనూ ఉల్లంఘనపై సీరియస్

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 17(తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని గిరిజన బాలకల రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టల్ భవన సముదాయాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కూడా పాల్గొని విద్యార్థుల వసతి, భోజన వసతులను పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు నేరుగా వంటశాల వద్దకు వెళ్లి, అప్పటికే వండి ఉన్న అన్నం, చిక్కుడుకాయ కూర, చారును స్వయంగా పరిశీలించారు.

అయితే, మెనూ ప్రకారం సాయంత్రం వేళ సాంబారు, కోడిగుడ్లు అందించాల్సి ఉండగా.. మధ్యాహ్నం వండిన చారునే సాయంత్రం కూడా పిల్లలకు వడ్డిస్తుండడాన్ని వారు గుర్తించారు. దీనిపై ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

అనంతరం స్టాక్ రూమ్‌ను పరిశీలించగా..*కూరగాయలు, పండ్లు అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ చేసి ఉండడం వారి దృష్టికి వచ్చింది. బాధ్యురాలైన వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడవద్దని, పిల్లలను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతమైతే సహించేది లేదని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.



# బీజేపీ హుజురాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా గంట సంపత్

• పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడి



**హుజురాబాద్,ఆగష్టు 17(తెలంగాణ ముచ్చట్లు ):** భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా గంట సంపత్ ఎన్నికయ్యారు. పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సంపత్ పేర్కొన్నారు.

హుజురాబాద్ పట్టణంలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానన్నారు.

గంట సంపత్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. పట్టణంలో పార్టీకి మరింత పటిష్టమైన క్యాడర్‌ను నిర్మించేందుకు సంపత్ కృషి చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు.

పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ క్రమశిక్షణతో పనిచేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తానని గంట సంపత్ తెలిపారు. పట్టణంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు.

# డీఎస్ మహేష్ తల్లి మృతికి గద్వాల కృష్ణ సంతాపం



**పెద్దమందడి,ఆగస్టు17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన ఎం.ఆర్.పి.ఎస్. సీనియర్ నాయకులు డీఎస్ మహేష్ తల్లి సంజాపాగ బుచ్చమ్మ మృతి పట్ల అఖిల భారత మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ గద్వాల కృష్ణ, ఎం.ఆర్.పి.ఎస్. సీనియర్ నాయకులు కేశపాగ కేశవులు సంతాపం వ్యక్తం చేశారు. బుచ్చమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన అనంతరం మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా గద్వాల కృష్ణ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల సహకారంతో డీఎస్ మహేష్ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సాగుతున్న ఉద్యమంలో నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. మహేష్ తల్లి బుచ్చమ్మ ఆకస్మిక మృతి ఆయన కుటుంబానికే కాకుండా ఎస్సీ సమాజానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు.ఈ దుఃఖ సమయంలో మహేష్ కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, బుచ్చమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గద్వాల కృష్ణ, ఎం.ఆర్.పి.ఎస్. సీనియర్ నాయకులు కేశపాగ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కార్యదర్శిగా బుట్టి సురేష్ యాదవ్

**వేలేరు, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం సమావేశం ఘనంగా నిర్వహించారు. ఉప సర్పంచ్‌ల ఐక్యత, గ్రామ పంచాయతీల బలోపేతం, స్థానిక సంస్థల అభివృద్ధిపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర మరింత కీలకమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బుట్టి సురేష్ యాదవ్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ అందజేయగా, సభలో పాల్గొన్న నాయకులు ఘనంగా అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శంకుస్థాపనలు సరే.. రోడ్డు మరమ్మతులు ఎప్పుడు?



- **బురదమయమైన ఎల్కతుర్తి–దామెర రహదారిపై బీజేపీ వినూత్న నిరసన**

**ఎల్కతుర్తి, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట హైవేకు కూతవేటు దూరంలో ఉన్న చింతలపల్లి-దామెర-సోమదేవరపల్లి-ధర్మసాగర్ రహదారి అధ్వానంగా మారినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆరోపించారు. ప్రజలు నాలుగు నెలలుగా రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.

వర్షం కురిసిన ప్రతిసారీ ఎల్కతుర్తి సర్కిల్ వద్ద రహదారి మొత్తం బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. హైవే నిర్మాణ పనుల్లో భాగంగా తీసిన నాలా, మరోవైపు అధ్వానంగా ఉన్న రహదారి కారణంగా ప్రజలు బురద నీటిలోనే ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై వినూత్న నిరసన

రోడ్డు దుస్థితిపై ప్రభుత్వాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రహదారిలోని గుంతల్లో బురదలో నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం శంకుస్థాపనలు, కార్యక్రమాలతో కాలం వెళ్లదీయడం సరైంది కాదన్నారు.

"ప్రజలు నాలుగు నెలలుగా ఈ రహదారిపై నరకయాతన అనుభవిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. శంకుస్థాపనలు సరే.. రోడ్డు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు? ఇప్పటికైనా ప్రభుత్వం, హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించి వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలి. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమం చేపడతాం" అని శ్రీకాంత్ యాదవ్ హెచ్చరించారు.

మండల ప్రభారీ లక్కిరెడ్డి తిరుమల మాట్లాడుతూ బురదమయమైన రహదారిపై ప్రజల ప్రయాణం ఇంకెన్నాళ్లు కొనసాగాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు అనికుమార్, చిదిరాల వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు కడారి ప్రసాద్, కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా కార్యదర్శి సామల సురేష్ రెడ్డి, మండల కార్యదర్శులు మాటూరి విద్యాసాగర్, కోడం రమేష్, చిర్ర శ్రీనివాస్, గణేష్ శ్రీనివాస్, కోశాధికారి హింగేదేవరావు, తక్కళ్లపల్లి సంపత్ రావు, గూడెం నాగరాజు, ఘనబోయిన నాగరాజు, పోలు నరేష్, నాంపల్లి మమత, ముషికే వెంకటేష్, జనగాని కిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, పల్లెపాటి మధుకర్, పెరుగు మధు, నంపెల్లి అశోక్, ఠాగూర్ శ్యాంసింగ్, సంపత్ రావు, సింగనబోయిన రాజు, సల్పాల కిరణ్, బీట్ల లింగన్న, మాచర్ల తిరుపతి, సాతురి ప్రభాకర్, వడ్లకొండ రాజు, శుభవర్ధన్, కపివర్ధన్, మడిపల్లి కొమురయ్య, రాజేందర్, చేరాల రంజిత్, సూర్యనారాయణ, జి. శ్రీనివాస్, గూడెల్లి దశరథం తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

- **యువజన కాంగ్రెస్ నేత ఎర్రోళ్ల చైతన్య కుమార్**



**ఎల్కతుర్తి ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ బాబు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల చైతన్య కుమార్ ఆరోపించారు. మంత్రిని విమర్శించే స్థాయి సతీష్ బాబుకు లేదన్నారు.

గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.237 కోట్లు విడుదల చేయడం ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కాలేజీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, ఫోర్‌లేన్ రహదారులు, చెరువుల పునరుద్ధరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇవన్నీ కనిపించడం లేదా అని సతీష్ బాబును ప్రశ్నించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని చైతన్య కుమార్ పేర్కొన్నారు.

# ఆచూకీ లేని మత్స్యకారులపై ఆందోళన



- **ఎనిమిది మంది కోసం గాలింపు**
- **కోస్ట్‌గార్డ్‌తో ముమ్మర చర్యలు**
- **కుటుంబాల్లో పెరుగుతున్న ఉత్కంఠ**

**కోనసీమ, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిన ఎనిమిది మంది మత్స్యకారులు ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో కోనసీమ జిల్లాలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన ఒక బోటులో ఈ నెల 3న మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లగా, నిర్ణీత గడువు ముగిసినా వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడం కలకలం రేపుతోంది. కుటుంబ సభ్యులు, మత్స్యకార సంఘాలు, అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మత్స్యకారులు సాధారణ చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లారు. ప్రణాళిక ప్రకారం ఈ నెల 13వ తేదీ నాటికి తిరిగి ఒడ్డుకు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు వారి బోటు గానీ, వారి ఆచూకీ గానీ లభించలేదు. దీంతో జిల్లా యంత్రాంగం పరిస్థితిని అత్యంత సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక చర్యలు ప్రారంభించింది.

మత్స్యకారుల వద్ద సుమారు 15 రోజుల పాటు సరిపడే ఆహార నిల్వలు, వెయ్యి లీటర్ల డీజిల్ మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గడువు దాటిపోవడంతో పాటు వారితో ఫోన్ ద్వారా కూడా సంబంధాలు తెగిపోవడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. బోటులో సాంకేతిక సమస్య తలెత్తిందా లేదా వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉందా అనే కోణాల్లో అధికారులు పరిశీలిస్తున్నారు. బోటు విశాఖపట్నం తీర ప్రాంతాన్ని దాటి ఒడిశాలోని పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర పరిస్థితులు మారి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బోటు కదలికలపై సమాచారం సేకరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

పరిస్థితి తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ వెంటనే ఇండియన్ కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయం చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో కలిసి గాలింపు చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. బోటు యజమాని నుంచి పూర్తి వివరాలు సేకరించి, మత్స్యకారుల పేర్లు, కుటుంబాల వివరాలు, బోటు ప్రయాణానికి సంబంధించిన సమాచారం కోస్ట్‌గార్డ్ అధికారులకు అందజేశారు. సముద్రంలో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, మత్స్యకారుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో తమ వారి రాక కోసం ఎదురుచూస్తున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారని, మత్స్యకారుల ఆచూకీ త్వరలో లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సమాచారం అందినా వెంటనే వెల్లడిస్తామని జిల్లా యంత్రాంగం తెలిపింది.

# ప్రేమ ముసుగులో పెరుగుతున్న నేరాలు

- **పెళ్లి హామీలు.. మోసాలు.. చివరకు హత్యలు**
- **యువతుల భద్రతపై దేశవ్యాప్తంగా ఆందోళన**
- **అప్రమత్తతే ప్రాణాలను కాపాడే మార్గం**



**డెస్క్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రేమ, వివాహం పేరుతో యువతులను నమ్మించి మోసగించడం, శారీరకంగా మరియు మానసికంగా వేధించడం, చివరకు హత్యలకు పాల్పడటం వంటి ఘటనలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో యువతిని హత్య చేసి గోనె సంచిలో తరలించే ప్రయత్నం చేసిన ఘటన మరోసారి ఇలాంటి నేరాల తీవ్రతను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రేమ పేరుతో ప్రారంభమైన సంబంధాలు కొన్నిసార్లు దారుణ నేరాలకు దారితీయడం సమాజాన్ని కలవరపెడుతోంది. గత కొన్నేళ్లుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రేమ, వివాహ హామీలు, సహజీవనం, ఆర్థిక ప్రయోజనాల పేరుతో మోసాలు పెరుగుతున్నాయని న్యాయ నిపుణులు, సామాజిక వేత్తలు చెబుతున్నారు. కొంతమంది వ్యక్తులు యువతుల నమ్మకాన్ని దుర్వినియోగం చేసుకుని తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని పేర్కొంటున్నారు. పరిస్థితులు తమకు అనుకూలంగా లేకపోతే బెదిరింపులు, దాడులు, హత్యల వరకు వెళ్తున్న ఘటనలు నమోదవుతున్నాయి. సామాజిక మాధ్యమాల విస్తరణతో పరిచయాలు వేగంగా పెరుగుతున్నప్పటికీ, వాటి వెనుక ఉన్న వ్యక్తుల నేపథ్యాన్ని పూర్తిగా తెలుసుకోకుండా సంబంధాలు కొనసాగించడం ప్రమాదకరంగా మారుతోందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, కుటుంబ నేపథ్యం, ఉద్యోగం, గత చరిత్ర వంటి అంశాలను నిర్ధారించుకోవడం అవసరమని సూచిస్తున్నారు. యువతులు మాత్రమే కాకుండా యువకులు కూడా భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తపడాలని నిపుణులు సూచిస్తున్నారు. వివాహం వంటి కీలక నిర్ణయాల్లో కుటుంబ సభ్యుల సలహాలు, చట్టపరమైన రక్షణలు, సామాజిక భద్రత అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులను లేదా కుటుంబ సభ్యులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

మహిళలపై నేరాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు ఉన్నప్పటికీ, అవగాహన లోపం, భయం, సామాజిక ఒత్తిళ్ల కారణంగా అనేక బాధితులు ముందుకు రావడం లేదని మహిళా సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రతి అనుమానాస్పద ఘటనను ప్రారంభ దశలోనే గుర్తించి ఫిర్యాదు చేయడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని అవి సూచిస్తున్నాయి. ప్రేమ అనేది విశ్వాసం, గౌరవం, బాధ్యతలపై నిలబడాలి కానీ మోసం, బెదిరింపులు, హింసకు మార్గం కాకూడదు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఇలాంటి ఘటనలు యువత, తల్లిదండ్రులు, సమాజం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. సంబంధాల విషయంలో జాగ్రత్త, చట్టపరమైన అవగాహన, కుటుంబ మద్దతు ఉంటేనే ఇలాంటి విషాదాలను నివారించగలమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆహార భద్రతపై ప్రపంచ దేశాల ఆందోళన



**డెస్క్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత నేడు అత్యంత కీలకమైన అంశంగా మారింది. ఒకప్పుడు ఆహార కొరత సమస్య ప్రధానంగా పేద దేశాలకే పరిమితమై ఉండేది. అయితే ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆహార ఉత్పత్తి, నిల్వ, సరఫరా వ్యవస్థల విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెరుగుతున్న జనాభా, వాతావరణ మార్పులు, సాగుభూముల తగ్గుదల, ప్రకృతి వైపరీత్యాలు, అంతర్జాతీయ ఘర్షణలు వంటి అనేక కారణాలు ప్రపంచ ఆహార భద్రతపై ప్రభావం చూపుతున్నాయి. మానవాళి భవిష్యత్తుకు ఇది ఒక పెద్ద సవాల్‌గా నిలుస్తోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రపంచ జనాభా రాబోయే దశాబ్దాల్లో మరింత పెరగనుంది. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆహార అవసరాలు కూడా గణనీయంగా పెరుగుతాయి. అయితే ఆహార ఉత్పత్తికి అవసరమైన సహజ వనరులు మాత్రం పరిమితంగానే ఉన్నాయి. సాగుభూములు పట్టణీకరణ కారణంగా తగ్గిపోతుండగా, నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అందరికీ సరిపడా ఆహారం అందించడం ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సవాలుగా మారింది.

వాతావరణ మార్పులు ఆహార భద్రతకు అత్యంత పెద్ద ముప్పుగా భావిస్తున్నారు. అనిశ్చిత వర్షపాతం, తీవ్ర ఉష్ణోగ్రతలు, వరదలు, కరువులు, తుఫానులు వ్యవసాయ ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయి. ఒక ప్రాంతంలో పంటలు బాగా పండినా మరో ప్రాంతంలో తీవ్ర నష్టాలు సంభవిస్తున్నాయి. దీని ప్రభావం ప్రపంచ ఆహార మార్కెట్లపై పడుతోంది. ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరిగి సాధారణ ప్రజలపై భారం పడుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కూడా ఆహార భద్రతపై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు ప్రపంచ ఆహార పంపిణీ వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. కొన్ని దేశాలు తమ దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆహార ఎగుమతులపై పరిమితులు విధించడం వల్ల ప్రపంచ మార్కెట్లలో అస్థిరత ఏర్పడుతోంది. ఫలితంగా దిగుమతులపై ఆధారపడే దేశాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

ఆహార ఉత్పత్తి పెంపుతో పాటు ఆహార వృథాను తగ్గించడం కూడా అత్యంత అవసరం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే ఆహారంలో గణనీయమైన భాగం వినియోగానికి ముందే వృథా అవుతోంది. నిల్వ సదుపాయాల కొరత, రవాణా సమస్యలు, వినియోగదారుల నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల విలువైన ఆహారం చెత్తకుప్పల్లోకి వెళ్తోంది. ఒకవైపు కోట్లాది మంది ఆకలితో బాధపడుతుండగా మరోవైపు ఆహారం వృథా కావడం ఆందోళన కలిగించే అంశం. సాంకేతికత ఆహార భద్రతకు కొత్త ఆశలు కల్పిస్తోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కృత్రిమ మేధస్సు ఆధారిత పంట నిర్వహణ, నీటి పొదుపు సాంకేతికతలు, వాతావరణ అంచనా వ్యవస్థలు రైతులకు సహాయపడుతున్నాయి. తక్కువ వనరులతో ఎక్కువ దిగుబడులు సాధించే మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఈ సాంకేతికతలను చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులోకి తీసుకురావడం కూడా అంతే ముఖ్యం.

భారత్ వంటి వ్యవసాయ ప్రధాన దేశాలకు ఆహార భద్రత మరింత ప్రాధాన్యమైన అంశం. దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ పోషకాహార లోపం, నిల్వ సమస్యలు, వ్యవసాయ వ్యయాల పెరుగుదల వంటి అంశాలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. రైతులకు సరైన మద్దతు, సాగునీటి సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే ఆహార భద్రతను మరింత బలోపేతం చేయవచ్చు. ఆహార భద్రత అనేది కేవలం వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇది ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, పర్యావరణం, సామాజిక స్థిరత్వంతో ముడిపడి ఉన్న విస్తృతమైన అంశం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## రూ.2 లక్షల రుణమాఫీతో

# రైతులకు ఊరట

హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి పంట సీజన్‌లోనే రూ.2 లక్షల వరకు పంట రుణాలను ఒకేసారి మాఫీ చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు. రైతాంగాన్ని అప్పుల భారం నుంచి బయటపడేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 25,35,964 మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా రూ.20,616.89 కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. దేశ చరిత్రలోనే ఇది ఒక కీలక ఘట్టమని పేర్కొంటూ, రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ పాలన నుంచి వచ్చిన ఆర్థిక ఒత్తిడులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని ఈ నిర్ణయం అమలు చేసినట్లు వివరించారు.

రుణమాఫీ అమలులో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని మంత్రి తెలిపారు. 40 బ్యాంకుల నుంచి అర్హులైన రైతుల రుణ ఖాతాల వివరాలను సేకరించి సమగ్ర పరిశీలన చేపట్టినట్లు చెప్పారు. బ్యాంకులు సమర్పించిన 42.30 లక్షల రుణ ఖాతాల్లో 31.07 లక్షలను కుటుంబ ఖాతాలుగా గుర్తించి పరిశీలించామని వివరించారు. అనంతరం అర్హత ప్రమాణాల ప్రకారం రూ.2 లక్షల వరకు బకాయిలు ఉన్న 25,35,964 ఖాతాలను ఎంపిక చేసి రుణమాఫీ అమలు చేసినట్లు వెల్లడించారు. రుణమాఫీ ప్రక్రియలో కొన్ని సాంకేతిక, పత్రాల సంబంధిత సమస్యలు వెలుగులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. ఏ ఒక్క అర్హ రైతు కూడా లబ్ధి నుంచి దూరం కాకూడదనే ఉద్దేశంతో అధికారులు గ్రామాల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఆధార్ అనుసంధానం, ఖాతాల సవరణ, ఇతర వివరాల పరిశీలనకు దాదాపు రెండు నెలల పాటు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు



వివరించారు. దీంతో తొలిదశలో మిగిలిపోయిన అర్హ రైతులను గుర్తించి తదుపరి విడతలో ప్రయోజనం అందించినట్లు తెలిపారు.

రుణమాఫీ అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను శాసనసభ ముందుంచామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా, గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితాలను అందుబాటులో ఉంచి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి చర్యలో జవాబుదారీతనం, పారదర్శకత, అర్హత పరిశీలనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రధాన అజెండా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, ఇచ్చిన హామీలను సమర్థంగా అమలు చేయడం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు అవసరమైన సహాయం అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.



## ఒక్కసారి ఛార్జింగ్‌తో

# 142 కి.మీ. రేంజ్..

### 30కి పైగా ఫీచర్లతో ఆంపియర్ కొత్త స్కూటర్

**న్యూఢిల్లీ,** ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు): ఎలక్ట్రిక్ స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఆంపియర్ కొత్త మ్యాగ్నస్ జీ మ్యాక్స్ ఫేస్‌లిఫ్ట్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే 142 కిలోమీటర్ల వరకు ప్రయాణ పరిధిని అందిస్తుందని కంపెనీ పేర్కొంది. ఈ స్కూటర్ గరిష్ఠ వేగం గంటకు 65 కిలోమీటర్లు కాగా.. 0 నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని 6.5 సెకన్లలో అందుకుంటుంది.

కొత్త మ్యాగ్నస్ జీ మ్యాక్స్‌లో 30కి పైగా ఫీచర్లను అందించారు. క్రూయిజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, టర్న్‌బైటర్న్ నావిగేషన్, ఫైండ్ మై స్కూటర్, ఓటీఏ అప్‌డేట్స్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. అలాగే కొత్త 5 అంగుళాల డిస్‌ప్లేతో పాటు కనెక్టెడ్ ఎకోసిస్టమ్‌ను కూడా అందించారు.

స్కూటర్‌లో రియల్‌టైమ్ ఛార్జింగ్ స్టేటస్, దొంగతనం, టోయింగ్ హెచ్చరికలు, రిమోట్ డయాగ్నోస్టిక్స్, ఛార్జింగ్ హిస్టరీ, బ్యాటరీ హెల్త్ వివరాలను తెలుసుకునే సదుపాయాలు ఉన్నాయి. అయితే ఫీచర్లను అప్‌డేట్ చేసినప్పటికీ స్కూటర్ సాంకేతిక సామర్థ్యంలో పెద్దగా మార్పులు చేయలేదు.

మ్యాగ్నస్ జీ మ్యాక్స్‌లో 3 కిలోవాట్ ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో పాటు 2.4 కిలోవాట్ హబ్‌మౌంటెడ్ మోటార్‌ను అమర్చారు. బ్యాటరీ పూర్తిగా ఛార్జ్ కావడానికి సుమారు 7.25 గంటల సమయం పడుతుంది. స్కూటర్‌లో 33 లీటర్ల బూట్ స్పేస్ కూడా ఉంది.

ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ.1.10 లక్షలుగా ఉంది. బ్యాటరీపై ఐదేళ్లు లేదా 75,000 కిలోమీటర్ల వారంటీని కంపెనీ అందిస్తోంది. మాన్‌సూన్ బ్లూ, మ్యాచ్ గ్రీన్ రంగులతో పాటు కొత్తగా సిన్నమోన్, కాపర్ రంగుల్లోనూ మ్యాగ్నస్ జీ మ్యాక్స్ అందుబాటులోకి రానుంది.



# రాహుల్‌కు సుప్రీంకోర్టులో ఊరట

- హైకోర్టు విచారణకు తాత్కాలిక నిలుపుదల
- సీబీఐ, ఈడీ నివేదికలపై ఆంక్షలు
- రాహుల్‌కు అవకాశం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్న
- దర్యాప్తు సంస్థల పాత్రపై ధర్మాసనం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి అలహాబాద్ హైకోర్టులో తదుపరి విచారణ చేపట్టవద్దని స్పష్టం చేస్తూ, సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికలను హైకోర్టుకు సమర్పించవద్దని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్యా బాగ్చీ, వీ. మోహన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారంటూ రాహుల్ గాంధీపై దాఖలైన పిటిషన్ నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాహుల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. పిటిషన్‌లో ప్రస్తావించిన అంశాలను పరిశీలించిన ధర్మాసనం, ఈ దశలో హైకోర్టు విచారణ కొనసాగించడం సముచితం కాదని భావించి తాత్కాలికంగా నిలిపివేసింది.

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు హైకోర్టు విధానంపై పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఒక వ్యక్తికి సంబంధించిన కేసులో అతనికి తన వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా ఎలా ఆదేశాలు జారీ చేశారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు నిర్ణయం తీసుకోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా కనిపిస్తోందని ధర్మాసనం అభిప్రాయపడింది. కేసు దాఖలు చేసిన కర్ణాటకకు చెందిన ఎస్. విఘ్నేశ్ సిసిర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు హైకోర్టులో ఎలాంటి పురోగతి ఉండకూడదని స్పష్టం చేసింది. దీంతో ఈ కేసులో రాహుల్ గాంధీకి తాత్కాలిక ఉపశమనం లభించినట్లయింది.

దర్యాప్తు సంస్థల వ్యవహారశైలిపైనా సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. ఆదాయానికి మించిన ఆస్తులపై విశ్వసనీయ సమాచారం అందితే సంబంధిత సంస్థలు స్వయంగా దర్యాప్తు చేపట్టవచ్చని, దాని కోసం తప్పనిసరిగా కోర్టు ఆదేశాలు అవసరమా అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులో ఇప్పటివరకు సీబీఐ, ఈడీ వంటి సంస్థలు స్వతంత్రంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కూడా పేర్కొంది. సీబీఐ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి. రాజును ఉద్దేశించి న్యాయమూర్తి జోయ్‌మాల్యా బాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. విషయం అంత తీవ్రమైనదైతే దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని, కోర్టు ఆదేశాల కోసం ఎందుకు ఎదురుచూశాయని ప్రశ్నించారు. స్వయంచాలకంగా ఏవైనా చర్యలు చేపట్టారా అని కూడా నిలదీశారు.

ఈ నేపథ్యంలో కేసు న్యాయపరంగా కొత్త మలుపు తిరిగింది. సుప్రీంకోర్టు జోక్యంతో ప్రస్తుతం హైకోర్టు ప్రక్రియ నిలిచిపోయింది. తదుపరి విచారణలో ధర్మాసనం తీసుకునే నిర్ణయం రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం మాత్రం సుప్రీంకోర్టు ఆదేశాలతో రాహుల్ గాంధీకి గణనీయమైన ఊరట లభించింది.

# అనసూయ వ్యాఖ్యలపై బీజేపీ నేతల ఫిర్యాదు..

- బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు): నటి అనసూయ చేసిన మతపరమైన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదానికి దారితీశాయి. ఆమె చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనసూయపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఇటీవల సోషల్ మీడియాలో అనసూయ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. 'జై శ్రీరామ్' పేరుతో కొందరు దాడులకు పాల్పడుతున్నారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మతపరమైన అంశాలపై మాట్లాడేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి వ్యాఖ్యల ద్వారా ఇతరుల మనోభావాలను దెబ్బతీయకూడదని వారు సూచించారు.

అయితే ఈ వివాదంపై అనసూయ వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనను విమర్శిస్తున్న వారికి కూడా ఆమె ఘాటుగా స్పందించినట్లు సమాచారం. తన వ్యాఖ్యల కారణంగా "దొంగలంతా బయటకు వస్తున్నారు" అంటూ ఆమె కౌంటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

సోషల్ మీడియాలో మొదలైన ఈ వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్ వరకు చేరడంతో విషయం మరింత ఆసక్తికరంగా మారింది. బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? విచారణ చేపడతారా? అనసూయను వివరణ కోరుతారా? అనే అంశాలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది.

మరోవైపు ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలపైనా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అనసూయకు అనుకూలంగా, వ్యతిరేకంగా నెటిజన్లు స్పందిస్తుండటంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.





# మహిళలకు కేంద్రం గుడ్‌న్యూస్..

### వ్యాపారం కోసం రూ.3 లక్షల వరకు రుణం

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (తెలంగాణ ముచ్చట్లు):

సొంతంగా చిన్న వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఉద్యోగిని యోజన' ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోంది. మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది. అర్హత ఉన్న మహిళలు వ్యాపారం ప్రారంభించడానికి లేదా ఇప్పటికే ఉన్న వ్యాపారాన్ని విస్తరించడానికి రుణ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

**రూ.3 లక్షల వరకు రుణం**

ఉద్యోగిని యోజన ద్వారా అర్హులైన మహిళలకు రూ.3 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంటుంది. ఈ రుణాన్ని వ్యాపార అవసరాలకు వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభించాలనుకునే మహిళలకు ఈ పథకం ఆర్థికంగా ఉపయోగపడుతుంది. కొన్ని సందర్భాల్లో రుణానికి తాకట్టు అవసరం లేకుండా సదుపాయం కల్పిస్తారు.

**సబ్సిడీ కూడా..**

ఈ పథకం కింద అర్హత ఉన్న సాధారణ వర్గానికి చెందిన మహిళలకు 30 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని సమాచారం. ఎస్సీ వర్గానికి చెందిన మహిళలకు 50 శాతం వరకు సబ్సిడీ అందించే అవకాశం ఉంది. అయితే సబ్సిడీ, రుణ పరిమితి, వడ్డీ రేటు వంటి వివరాలు సంబంధిత బ్యాంకు లేదా అమలు సంస్థ నిబంధనలపై ఆధారపడి ఉంటాయి.

**ఎవరు అర్హులు?**

18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు ఈ పథకానికి అర్హులుగా పేర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వంటి అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. బ్యాంకుల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ మార్గంలో కూడా దరఖాస్తు చేసుకునే సదుపాయం ఉంటుంది.

అయితే 'ఉద్యోగిని యోజన' పేరుతో అమలయ్యే రుణ సదుపాయాల నిబంధనలు బ్యాంకు, రాష్ట్రం, పథకం అమలు విధానం ఆధారంగా మారవచ్చు. కాబట్టి దరఖాస్తు చేసే ముందు సంబంధిత బ్యాంకు లేదా అధికారిక ప్రభుత్వ వనరుల్లో తాజా అర్హతలు, సబ్సిడీ వివరాలు, రుణ నిబంధనలను తప్పనిసరిగా నిర్ధారించుకోవడం మంచిది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in